క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కే) గ్రామానికి చెందిన సిర్మన్ భోజన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు రూ.5,100 జమ చేసి బాధిత కుటుంబసభ్యులకు ఆర్థికసాయంగా అందించారు. ప్రభుత్వ ఉద్యోగులు మగ్గిడి దయాకర్, చంద్యాల గంగాకిషన్, చంద్యాల నరహరి, ద్యాగరి ముత్యం, అంతరం నవనీత్‌కుమార్, ఎల్లన్న, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ గుంతను పూడ్చరూ..



రోడ్డుపై గుంత

కుభీర్: మండలకేంద్రం నుంచి పల్సి గ్రామానికి వెళ్లే మార్గంలో పల్సికి సమీపంలో రోడ్డుపై గుంత ఏర్పడింది. దీంతో రాత్రి రాకపోకలు సాగించే వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ఖానాపూర్: నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని రాజురా గ్రామంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

ఏడుగురిపై కేసు

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామ శివారులో మంగళవారం కోడిపందేలు ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సోన్ ఎస్సై కే.గోపి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంక్రాంతి పండుగ సందర్భంగా పాక్‌పట్ల గ్రామ శివారులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన కొందరు వ్యక్తులు కోడి పందేలు ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. తమ్మి శెట్టి కార్తీక్, శ్రీను, రవి, రవీంద్ర, వెంకట్రావ్, రాములు, సత్యజీ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బుధవారం ఎస్సై తెలిపారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

లక్ష్మణచాంద: బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఎస్సై సుమలత హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా బుధవారం మండలంలోని కనకాపూర్‌లో అధికారులు తనిఖీ నిర్వహించగా బేకరీ షాప్‌లో, పానీపూరి షాప్ వద్ద ఒకొక్కక్కరు ఇద్దరు బాలురు పని చేస్తూ కన్పించారు. దుకాణ యజమానులను అదుపులో తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

ఖానాపూర్: పట్టణ శివారులోని విద్యానగర్‌లో దసరా రోజున శమీ పూజ చేసే స్థలంలో ఉన్న జమ్మిచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించిన విషయమై బుధవారం కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎస్సై రాహుల్ గైక్వాడ్‌కు విన్నవించారు. విద్యానగర్ అధ్యక్షుడు పరాంకుశం శ్రీనివాస్, కాలనీవాసులు కొండాడీ గంగారావు, పడాల ప్రభాకర్, బీసీ రమేశ్, ఏనుగుల రాజేశ్వర్, శ్రీనివాసకృష్ణ, సురేశ్, రాకేశ్, శ్రీనివాస్, ప్రదీప్, రమేశ్ ఉన్నారు.

అన్నదానం

కుభీర్: మండలకేంద్రంలోని మహాలక్ష్మీ మందిరంలో బుధవారం భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి మరుసటిరోజు ఇక్కడ అన్నదానం చేయడం ఆనవాయితీ. మంగళవారం రాత్రి భజనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, ఉదయం శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బి.గణేశ్, యాదవ సంఘం అధ్యక్షుడు ఉప్పు దత్తాత్రి, కమిటీ సభ్యులు ఉన్నారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు



గాయపడ్డ రాజవ్వ

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కీర్తి రాజవ్వ అనే వృద్ధురాలిపై బుధవారం కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేసింది. కోతులు దాడి చేయడంతో వృద్ధురాలు కింద పడిపోగా, చేయి విరిగింది. కొద్ది రోజులుగా కోతులు ఇళ్లల్లో చొరబడి దాడులకు పాల్పడడంతోపాటు సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కోతుల బెడద నిర్మూలించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

సంక్రాంతి.. ఆనందాల క్రాంతి



భైంసారూరల్ : ఇలేగాంలో చిన్నారులపై భోగిపండ్లు పోస్తున్న కుటుంబీకులు



కుంటాల: విఠాపూర్‌లో నోము ఇచ్చి ఆశీర్వదిస్తున్న మహిళలు



తానూరులో..



నిర్మల్‌లో గొబ్బెమ్మకు పూజ చేస్తున్న చిన్నారి శ్రేయాన్వి



కుంటాలలో ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో నోములతో మహిళలు



ముథోల్‌లో హరిదాసు సందడి



లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో ముగ్గు వేస్తూ..



మామడ: పొన్కల్‌లో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారితో గ్రామ ఉద్యోగులు

నిర్మల్‌టౌన్/ఖానాపూర్/కుంటాల/తానూరు/లక్ష్మణచాంద/భైంసారూరల్/మామడ/ముథోల్: జిల్లావ్యాప్తంగా సంక్రాంతి, కనుమ పండుగల నేపథ్యంలో ఇళ్ల ముందు రంగవల్లులను తీర్చిదిద్దారు. అందులో గొబ్బెమ్మలను ఉంచి పూజలు చేశారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారు పండుగకు సొంత ఊళ్లకు వచ్చి కుటుంబసభ్యులతో సందడిగా గడిపారు. సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ చిన్నారులపై భోగి పండ్లు పోశారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా డీజేలు పెట్టి నృత్యాలు చేశారు. గాలిపటాలను ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. జిల్లాకేంద్రంలోని సోఫీనగర్ కాలనీ హనుమాన్ ఆలయ ఆవరణలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ముగ్గులు పరిశీలించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు చిన్నయ్య, నర్సింగ్‌రావు, నాగేశ్, సాయిబాబా, సాయినాథ్, సురేశ్, సుదర్శన్, భాస్కర్ పాల్గొన్నారు.

కుంటాల మండలంలోని కల్లూరు, కుంటాల గ్రామాల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవం నిర్వహించారు. జిల్లా గోసేవ ప్రముఖ్ కాపు నారాయణ, జిల్లా ప్రచార ప్రముఖ్ వంగల సుధాకర్, స్వయంసేవక్ లు, పాల్గొన్నారు. మామడ మండలంలోని పొన్కల్‌లో గ్రామ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన పసువుల వినూత్న(ప్రథమస్థానం), ఆద్యశ్రీ(ద్వితీయస్థానం), వినూత్న(తృతీయస్థానం)లకు బహుమతులు అందించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యు.రమేశ్ ప్రధాన కార్యదర్శి సల్కమ శేఖర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

భైంసాటౌన్: సమాజంలో మనమంతా ఒక్కటేననే భావనతో ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఆర్ఎస్ఎస్ నాయకులు అన్నారు. పట్టణంలోని నర్సింహానగర్‌లో ఉన్న నర్సింహా కల్యాణమండపంలో ఆర్ఎస్ఎస్ మహిషాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మకర సంక్రాంతి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు ధర్మాజీ చందానే, ముఖ్య వక్తగా ఆర్ఎస్ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్ హాజరై మాట్లాడారు. దేశ సమగ్ర వికాసానికి, సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. జిల్లా సహ సంఘచాలక్ సాదుల కృష్ణదాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో కళ్లు తెరవాలి'

నిర్మల్‌ఖిల్లా: నూతన పింఛన్ విధానంపై ఇటీవల సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలతోనైనా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కళ్లు తెరవాలని సీపీఎస్ ఉద్యమ రాష్ట్రనాయకులు, ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి సీపీఎస్ కృష్ణారావు సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విశ్రాంత న్యాయమూర్తులకు నూతన పెన్షన్ విధానం అమలు పరచడం వల్ల అరకొర పింఛను అందుతుందని ఇటీవల సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందని గుర్తు చేశారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే శాసనమండలి వేదికగా తన గొంతుక వినిపిస్తానని స్పష్టంచేశారు.

మోటారుకు మరమ్మతు

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో ఉన్న గంగపుత్ర కాలనీలో మోటారు కాలిపోయి ప్రజలకు నీటి సమస్య తలెత్తింది. దీంతో కాలనీవాసులు కౌన్సిలర్ పరిమి లత సురేశ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన కౌన్సిలర్ మున్సిపల్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి మోటారుకు మరమ్మతు చేయించారు.

'నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి'

ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చడం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, ప్రభుత్వ ఆస్పత్రిని ఏరియా ఆస్పత్రిగా మార్చాలన్నారు. డీ27 కాలువ ద్వారా ఆయకట్టుకు నీరు అందేలా చూడాలని పేర్కొన్నా రు. డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్, సర్దార్, నర్సయ్య, లింగన్న, వెంకటేశ్, రాజేశ్ ఉన్నారు.

గ్రామసభల్లో అర్హులనే ఎంపిక చేయాలి



కుభీర్‌లో మాట్లాడుతున్న అధికారులు



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న జీవరత్నం

కుభీర్: ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల కోసం అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఎంపీడీవో నవనీత్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల కార్యదర్శులు, వ్యవసాయాధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గురువారం సర్వే నిర్వహించి.. శుక్రవారం నుంచి గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో మోహన్‌సింగ్, ఏపీవో హరిలాల్, ఈజీఎస్, వ్యవసాయాధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తానూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ లింగంమూర్తి సూచించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంపీవో నసీరొద్దీన్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే చేయాలి

ఖానాపూర్: రేషన్‌కార్డులు, ఇందిరమ్మఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతు భరోసా పథకాల అమలుకు అధికారులు పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక సర్వే చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సర్వే అనంతరం ఈనెల 20 నుంచి 23 వరకు గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సునీత, కమిషనర్ మనోహర్, ఎంపీవో రత్నాకర్‌రావు, తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 20 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీఓ అమీర్‌ఖాన్, ఏపీఓ ప్రమీల, కార్యదర్శులు, టీఏ దినేశ్, భీమ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు



నిర్మల్‌లోని మల్లన్నగుట్ట ఆలయంలో జ్యోతిని దర్శించుకుంటున్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట ఆలయంలో మంగళవారం రాత్రి అయ్యప్ప జ్యోతి దర్శనం నిర్వహించారు. భక్తులు తరలివచ్చి గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్పస్వామి వార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ-మురళీధర్‌రెడ్డి దంపతులు మెట్ల పూజ, దీపారాధన చేశారు. గురుస్వామి మూర్తి, కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్‌లో పల్లకి శోభాయాత్రలో భక్తులు

సోన్: మండలంలోని కడ్తాల్ అయ్యప్ప ఆలయం సంకీర్తనలు, శరణుఘోషతో మార్మోగింది. మంగళవారం ఉదయం సుప్రభాతసేవ అనంతరం స్వామివారికి పూజలు చేశారు. ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిలో వీధులగుండా భాజాభజంత్రీలు, మంగళహారతుల నడుమ ఊరేగించారు. శబరిమలై తరహాలో కడ్తాల్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో మకరజ్యోతి దర్శనం మంగళవారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ గురుస్వామి నర్సారెడ్డి మకరజ్యోతిని వెలిగించారు. రాత్రి మహాపడిపూజ నిర్వహించారు.

గ్రామాల్లో పర్యటన

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్, పాతతర్లపాడ్ గ్రామాల్లో బుధవారం ఎంపీవో రత్నాకర్‌రావు పర్యటించారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ పరిధిలోని వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లతోపాటు పంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేశారు. అవసరమైన చోట వీధిదీపాలు ఏర్పాటు చేసి పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

నర్సాపూర్ (జి): మండలంలోని అర్లి(కె)లో గ్రామస్థాయి అర్లి ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) క్రికెట్ పోటీలను నిర్వహించారు. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అర్లి(కే) టైగర్స్ విజేతగా నిలిచింది. అనంతరం విజేతలకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ కల్యాణ్ పటేల్ రూ.12 వేల విలువైన ట్రోఫీలను అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

కుంటాల: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని కల్లూరు గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. యువకులు ఐదు జట్లుగా పోటీల్లో తలపడగా యువసేన యూత్ జట్టు విజేతగా నిలిచింది. గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శ్రీహరిరావు, నేతలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్‌లో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు.. పీఆర్టీయూ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పీ ఆ ర్టీయూ సంఘం సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తోట నరే ంద్రబాబు, కొబ్బాయి శంకర్, బి.గజ్జారాం, కుంట సాయికుమార్, సగ్గం స్వామి, చింత మోహన్, సాయిప్రసాద్, రాజన్న, కృష్ణ, పరమేశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

న్యాయమూర్తిని కలిసిన నేతలు



శ్రీదేవికి మొక్క అందిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండలంలోని కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవిని జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మొక్క అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు రాజేశ్వర్, ఓ.రాజేశ్వర్, ప్రతాప్‌రెడ్డి, సిరాజ్, నరేశ్, రవి, నాగేశ్, భూమన్న, బిట్లింగ్ రజినీకాంత్, దినేశ్ తదితరులున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

కుంటాల: మద్యం సేవించి వాహనాలు నడిపి.. ప్రమాదాల బారిన పడొద్దని భైంసారూరల్ సీఐ నైలు సూచించారు. బుధవారం మండలంలోని అర్లి(కె)లో జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. వాహన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. ఎస్సై భాస్కరాచారి, ఏఎస్సై జీవన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ముప్పని తెలిసినా పట్టించుకోరా.?



తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామం నుంచి సోనారి జేఎస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు వద్ద రోడ్డు భారీవర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాత్రి గుంత కన్పించక ద్విచక్రవాహన దారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కమలాకర్, పీఆర్ డీఈ, ఫోన్: 91211 35604

అదుపుతప్పి వాహనాలు బోల్తా



భైంసాలో బోల్తాపడిన లారీ



సారంగపూర్ : బోల్తాపడిన కారు

భైంసాటౌన్: పట్టణంలోని కుభీర్ రోడ్డులో మంగళవారం సాయంత్రం ఓ లారీ బోల్తా పడింది. స్థానిక పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీ నుంచి పత్తి గింజల లోడ్‌తో వెళ్తున్న లారీ కుభీర్ చౌరస్తా సమీపంలో ఒక్కసారిగా పక్కకు ఒరిగింది. దీంతో లారీలోంచి పత్తిగింజల సంచులు కిందపడిపోయాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. పైన విద్యుత్ తీగలకు తగలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

కోతులను తప్పించబోయి..

సారంగపూర్: మండలంలోని డ్యాంగాపూర్ సమీపంలోని మహబూబాఘాట్స్ వద్ద అడ్డువచ్చిన కోతుల గుంపును తప్పించబోయి ఓ కారు బోల్తా పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం వడూర్ గ్రామం నుంచి మల్లెపూల నర్సయ్య స్విఫ్ట్ డిజైర్ కారులో తన మనవడు గౌతంను తీసుకుని నిర్మల్ వెళ్తున్నాడు. డ్యాంగాపూర్ వద్దకు చేరుకోగానే అడ్డు వచ్చిన కోతుల గుంపును తప్పించబోయి కారును మరోవైపునకు తిప్పాడు. దీంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈప్రమాదంలో గౌతమ్‌కు స్వల్ప గాయాలవగా నర్సయ్య క్షేమంగా బయటపడ్డాడు. స్థానికులు గౌతమ్‌ను నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

తానూరు: ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రమేశ్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని హంగిర్గా గ్రామంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా వెంట ఉంచుకోవాలన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నందున.. అపరిచితులు ఫోన్‌కు పంపే లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని పే ర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.